## కథ

## దానం ఉమాదేవి

# దంతసిరి

“ఎలా ఉంది ఆరోగ్యం?” అన్న మాటతో అప్పటి దాకా టి.వి.చూస్తున్న కిరణ్ తలతిప్పి చూశాడు. ఎదురుగా కొలీగ్ విశ్వం.

“రా! రా! కూర్చో” అంటూ కుర్చీ చూపించాడు.

“రెండు రోజుల్నుండి ఆఫీసుకు రావటం లేదు కదా! పనిమీద వెళ్తూ చూసిపోదామని వచ్చాను”

పెద్దగా నవ్వాడు కిరణ్.

“ఆరోగ్యానికేమి భేషుగ్గా ఉంది. టి.వి.లో క్రికెట్ మ్యాచ్ వస్తున్నది కదా? అందుకే సెలవు పెట్టాను”

కిరణ్‌కు క్రికెట్ పిచ్చి బాగా ఉందని అర్థమైంది విశ్వానికి. తాను కూడా క్రికెట్ చూస్తాడు కానీ సెలవు పెట్టి మరీ చూడడు.

విశ్వంతో మాట్లాడిన గంటా క్రికెట్ గురించే జరుగుతున్న మ్యాచ్ గురించి, వాళ్ళు కొట్టిన షాట్లు గురించి బ్రేక్ లేకుండా చెప్పుకుపోతున్నాడు కిరణ్. భార్య అరుణ కాఫీలు ఇవ్వటంతో కిరణ్ నోటికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.

కిరణ్‌కన్నా ముందుగానే గబగబా కాఫీ తాగేసి పనుందని బయటపడ్డాడు విశ్వం. కిరణ్ కాఫీ తాగే దాకా ఉంటే ఇప్పట్లో తనను వదలడు.

కిరణ్ క్రికెట్ పిచ్చి గురించి ఆఫీసులో అందరికీ తెలిసింది. కిరణ్‌కుమార్ బదులు క్రికెట్ కుమార్ అనే నిక్‌నేమ్ పెట్టారు. దానిని కాంప్లిమెంట్‌గానే భావిస్తాడు కిరణ్.

కిరణ్‌కు ఆ ఊరు ట్రాన్స్‌ఫరై ఆరు నెలలైంది. నలభై అయిదేళ్ళుంటాయి. కానీ చూడటానికి నలభై లోపు లాగా ఉంటాడు. అందరితో క్లోజ్‌గా ఉంటాడు.

“మా వాడికి టెన్త్‌లో ఐదొందల పాతిక మార్కులు వచ్చాయి” అంటూ అందరికీ మైసూర్‌పాక్ పంచాడు ఆ ఆఫీసులో పనిచేసే సుధీర్.

“మెత్తటి స్వీట్లు తెస్తే తినగలను కానీ వీటిని కొరకటం నా వల్లగాదు” చెప్పాడు రిటైర్మెంటు దగ్గర్లోకి వచ్చిన రాజారావు.

“నా వల్ల అసలే కాదు” అన్నాడు కాంతారావు. అతని ముందు పన్ను ఒకటి ఊడింది కూడా.

కాసేపు చర్చ దంతాలమీద సాగింది.

“వెనకటి వాళ్ళకున్న దంతసిరి ఇప్పుడేది! చిన్న వయసు నుండే చిగుళ్ళవాపు, దంతాలు వదులవటం, గట్టి పదార్థం తినాలంటే ఇబ్బంది” అంటూ చిన్నగా బుగ్గలు వత్తుకున్నాడు విశ్వం.

“మైసూర్‌పాక్ చాలా బాగుందోయ్” అంటూ గబగబా నాలుగు ముక్కలు తిన్న కిరణ్ వైపు అందరూ అసూయగా చూశారు.

“నువ్వు తీసుకునే జాగ్రత్తలేమిటో, వాడే పేస్ట్ ఏమిటో చెప్పవయ్యా” అంటూ బతిమిలాడాడు కాంతారావు.

“నేను ఏ జాగ్రత్తలు తీసుకోను. అది సహజంగా రావాలండి” అంటూ నవ్వాడు కిరణ్.

అదీ నిజమేననిపించింది అందరికి.

ఆఫీసు పనిమీద కిరణ్ మరో నలుగురికి హైదరాబాద్ వెళ్ళాల్సిన పని పడింది. మూడు రోజుల తరువాత ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు అందరూ తమ పిల్లలకు బట్టలు కొంటే కిరణ్ మాత్రం మూడొందలు పెట్టి కొడుకు అభినవ్‌కు బ్యాట్ కొన్నాడు.

అభినవ్‌కు పన్నెండేళ్ళుంటాయి. ఏడో తరగతి. క్రికెట్ తప్ప మరో ఆట ఆడడు. తండ్రితోపాటు గంటలు గంటలు టి.వి.లో క్రికెట్ చూసినా కిరణ్ ఏమీ అనడు. వేరే చానల్ చూస్తే మాత్రం చదువుకో పొమ్మని అరుస్తాడు.

“పిల్లల్ని పోగేసి ఎప్పుడూ ఆటలేనా..పైగా ఇంట్లోనే ఆడతారు. ఈ గోల భరించటం నా వల్ల కాదు” అంటూ కొడుకు అభినవ్ మీద విసుక్కున్నది అరుణ.

“ఇప్పుడు ఇంతే అంటావోయ్. రేపు వాడు పెద్ద ఏ జాతీయస్థాయి క్రికెటరో అయితే అందరికీ అప్పుడు గర్వంగా చెప్పుకోవూ?” అంటూ కొడుకును వెనకేసుకొచ్చిన భర్తను రుసరుస చూసింది.

“మీకు క్రికెట్ మీదున్న ఇంట్రెస్ట్ వాడి చదువుమీద లేదు. మీ అలుసు చూసుకొని వాడు నా మాట కూడా వినటం లేదు”

రెండు నెలల తరువాత కిరణ్ ఏకంగా వారం రోజులు లీవ్ పెట్టాడు. ఎవరూ పరామర్శించే సాహసం చేయలేదు.

“ఇప్పుడు క్రికెట్ మ్యాచ్‌లేమీ లేవు కదా! కిరణ్ ఎందుకు లీవ్ పెట్టినట్లో?” సందేహం వెలిబుచ్చాడు రాజారావు.

“పిల్లలు ఏమన్నా ఇంటి ముందు క్రికెట్ ఆడుతున్నారేమో” అంటూ నవ్వాడు కాంతారావు.

“లేక తనే బరిలోకి దిగాడేమో” అన్న సుధీర్ మాటలకు అందరూ నవ్వారు. వారం తరువాత వచ్చిన కిరణ్‌ని అందరూ పలకరించారు.

“ఫీవరొచ్చింది” తన సెలవుకు కారణం చెప్పాడు.

ఆఫీసు అయిపోయాక కిరణ్, విశ్వం, సుధీర్ ముగ్గురూ ఇళ్ళకు బయల్దేరారు. ముగ్గురి ఇళ్ళూ ఒక పేటలోనే.

“ఇక్కడ పిల్లలు క్రికెట్ ఆడుతుంటారు. మనం పక్క వీధిలో నుండి వెళదాం” అంటూ గబగబా అడుగులేస్తున్న కిరణ్‌వైపు ఆశ్చర్యంగా చూశారు విశ్వం, సుధీర్.

అప్పుడే బ్యాట్ పట్టుకున్న చిన్నపిల్లాడి ఆటను కూడా శ్రద్ధగా చూసే కిరణ్, క్రికెట్ చూడకుండా వెళ్ళటానికి కారణం తెలియలేదు వాళ్ళకి.

అదే మాట అడిగారిద్దరూ.

“ఆ..ఏముందండి ఆ ఆటలో” అంటూ తేల్చేశాడు.

“కిరణ్‌లో ఇంత మార్పా” ఆ షాక్‌లో నుండి మిత్రులిద్దరూ ఇంకా బయటకు రాలేదు.

మరునాటి రోజు నుండి ఆఫీసులో ఇదే చర్చ.

“ఏదైనా కరిచిందేమో”

“ఏ విషయంలోనైనా అతిగా ఉంటే ఇలాగే విరక్తి పుడుతుంది”

“అంత క్రికెట్ పిచ్చోడికి ఇంత ఫోబియా ఎలా పట్టుకుంది”

ఇప్పుడు క్రికెట్ మ్యాచ్ జరుగుతున్నా కిరణ్ లీవ్ పెట్టటం లేదు. తన ఎదురుగా ఎవరైనా టి.వి.లో క్రికెట్ మ్యాచ్ చూస్తున్నా వణికిపోతున్నాడు.

కిరణ్‌ని తరచి తరచి ప్రశ్నించినా సంతృప్తికర సమాధానాన్ని రాబట్టలేకపోయింది మిత్రబృందం.

జరిగింది ఏమిటి అన్నది కిరణ్‌కు, అతని కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసు.

వారం క్రిందట కిరణ్ ఇంట్లో టి.వి. చూస్తుండగా సుపుత్రుడు వీధిలో క్రికెట్ ఆడుతున్నాడు. అభినవ్ లాగి పెట్టి షాట్ కొట్టటంతో బంతి వేగంగా వచ్చి కిరణ్ మూతికి తగలటం నోట్లో ఉన్న కట్టుడుపళ్ళు క్రిందపడి విరగటం కన్నుమూసి తెరిచేలోగా జరిగింది.

కిరణ్‌కు నలభై ఏళ్ళకే చిగుళ్ళవాపు వచ్చి దంతాలు వదులై డెంటిస్ట్‌ను కలిశాడు. సరిగా ఆహారం కూడా తీసుకోలేని తన సమస్య గురించి చెప్పాడు.

దంతాలన్నీ బాగా వదులయ్యాయని మందులు వాడినా పెద్దగా ప్రయోజనం ఉండదని పెద్దవాళ్ళలో ఎవరికైనా చిన్న వయసులోనే పండ్లన్నీ ఊడిపోతే అదే వారసత్వంగా వస్తుందని చెప్పాడు డెంటిస్ట్.

తన అమ్మమ్మకు చిన్నతనంలో పండ్లు ఊడిపోవటం గుర్తొచ్చింది కిరణ్‌కు. డాక్టర్‌గారి సలహా మేరకు ఇరవై రోజులు సెలవుపెట్టి పండ్లన్నీ పీకించుకొని కట్టుడు పళ్ళు పెట్టించుకున్నాడు.

అయిదేళ్ళ నుండి కట్టుడు పళ్ళతోనే కాలం గడుపుతున్నాడు. అవి సెట్ అయ్యేదాకా మొదట్లో చాలా ఇబ్బందిపడ్డాడు. చిగురు ఒరుసుకుపోయి పుండులా మారి కొన్నాళ్ళు బాధ పెట్టింది. రాను రాను చిగుళ్ళు కూడా గట్టిపడి ఇప్పుడు గట్టి పదార్థం కూడా వీటితో తినగలుగుతున్నాడు. రాత్రిపూట మాత్రం తీసి పక్కన పెడతాడు. చిగుళ్ళకు కాస్త గాలి తగిలితే మంచిదని.

కిరణ్ కట్టుడు పళ్ళ వ్యవహారం తెలీని ఇక్కడి మిత్రులు అతని దంతసిరికి అసూయపడుతున్నారు. కిరణ్ కూడా తన పళ్ళు ఒరిజినలే అన్నట్టు బిల్డప్ ఇస్తాడు.



ఇప్పుడు క్రికెట్ బంతి తగిలి ఆ పళ్ళు క్రిందపడి విరిగిపోయాయి. చిగురు కూడా కాస్త ఒరుసుకుపోయింది.

సుపుత్రుడి మీదా, క్రికెట్ మీద పట్టరాని కోపం వచ్చింది. ఇప్పుడెలా? తాను బయటికి ఎలా వెళ్ళాలి?

"అభీ" గట్టిగా కేకేశాడు.

కానీ మాట స్పష్టంగా రాలేదు.

ఈలోగా ఒక పదేళ్ళ కుర్రవాడు లోపలికి వచ్చాడు.

"తాతయ్యా! బాల్ ఇక్కడ పడిందా?"

గతుక్కుమన్నాడు కిరణ్. తనను చూసుకున్నాడు. ఎప్పుడో అత్తగారు పెట్టిన పంచెను లుంగీలాగా కట్టుకున్నాడు. పైగా బోసినోరు. వాడు తనను గుర్తుపట్టలేదన్న మాట.

"ఇళ్ళమధ్య ఏం ఆటలు. ఇంకోసారి బాల్ ఇంట్లో పడిందంటే వీపు చీరేస్తాను" కోపంగా అన్నాడు.

కానీ తానన్నది ఏమిటో తనకే సరిగా అర్థం కాలేదు అన్నీ తొస్సుపోతున్నాయి.

విరిగిన కట్టుడు పళ్ళను పెట్టుకోవడానికి ప్రయత్నించాడు కానీ కుదరలేదు. వెంటనే డెంటిస్ట్‌ను కలిశాడు. చిగుళ్ళ అచ్చుతీసి వారం తరువాత కలవమన్నాడు.

మళ్ళీ నోట్లోకి పళ్ళు వచ్చేటప్పటికి నాలుగు వేల పైనే ఖర్చు అయింది. కొడుకును క్రికెట్ ఆడొద్దని కట్టడి చేసినా వినే స్టేజి దాటిపోయాడు. పైగా తనకు ఏదైనా కావాలని అడిగేటప్పుడు బంతి చేతిలో ఉంచుకుంటున్నాడు. దాన్ని చూడగానే పులిని చూసినట్లు వణికిపోతున్నాడు కిరణ్.

బంతి పక్కన పెడితే అడిగినవన్నీ కొనిపెడతాను అనే షరతు విధించి దాన్ని పక్కన పెట్టించి కొడుకు కోర్కెలు తీరుస్తున్నాడు.

మధ్యమధ్యలో అభినవ్ తండ్రికి ఉచిత సలహా కూడా ఇస్తున్నాడు.

"ఇంకో సెట్టు రడీగా ఉంచుకోవచ్చుకదా! ఇది విరిగితే పనికొస్తుంది"

తనకు తెలిసి ఎవరూ రెండుసెట్ల కట్టుడుపళ్ళు ఉంచుకున్న వాళ్ళు లేరు. మళ్ళీ మరో రెండు వేలు. ఇవేమన్నా బట్టలా! నాల్గు జతలుంచుకోవటానికి.

కొత్తసెట్ అవటం వల్ల కొంచెం అనీజీగా ఉంటోంది. చిగుళ్ళు ఒరుసుకుపోయి నొప్పి పెడుతున్నాయి కూడా. అందుకే క్రికెట్ అంటే అంత భయం. తప్పనిసరై పిల్లలు క్రికెట్ ఆడుతున్న వైపే వెళ్ళాల్సి వస్తే రెండు చేతులతో మూతి చెంపలు కవర్ చేసుకుంటూ గబగబా వెళ్తున్నాడిప్పుడు.

ఇవేమీ తెలియని విశ్వం, మిగతా మిత్రబృందం మాత్రం అంత క్రికెట్ పిచ్చోడికి ఇంత క్రికెట్ ఫోబియా ఎలా వచ్చిందో తెలియక జుట్టు పీక్కుంటూనే ఉన్నారు.